# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 354 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 09, జులై 2024 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


## స్పష్టం చేసిన తెలంగాణ విద్యాశాఖ

హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దు చేసి మరిన్ని పోస్టులను జత చేసిన మెగా డీఎస్సీ నిర్వహించాలన్న డిమాండ్‌తో అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు. ఈ రోజు కూడా పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ముందు అభ్యర్థులు ఆందోళన చేశారు. ఈ ఆందోళనను పట్టించు కోకుండా ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వ హించాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11 నుండి వెబ్ సైట్‌లో హాల్ టికెట్స్ అందుబాటులో ఉండనున్నాయి. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్స్ ఉండనున్నాయి. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 5 వరకు డీఎస్సీ జరగనున్నాయి.



# యుద్ధప్రాతిపదికన స్కిల్ యూనివర్సిటీ

- అసెంబ్లీ సమావేశాలకు ముందే ఏర్పాటు
- ఐఎస్‌బి తరహాలో బోర్డు ఏర్పాటుకు చర్యలు
- విద్యారంగ, పారిశ్రామిక ప్రముఖులలకు సూచన
- ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ సందర్శించిన సిఎం రేవంత్



హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరగాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ముందే జులై 23 లోపు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమల శాఖ, విద్యా శాఖ అధికారులతో పాటు పారిశ్రామిక రంగ ప్రముఖులకు సీఎం సూచించారు. వాటిని పరిశీలించి ఇరవై నాలుగు గంటల్లో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులతో ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో స్కిల్ డెవెలప్మెంట్ పై సమావేశ మయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతో పాటు ప్రముఖుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అటు ఐటీ కంపెనీలతో పాటు ఇటు పరిశ్రమలన్నింటికీ అందు బాటులో ఉన్నందున ఈ సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పా టుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐ.ఎస్.బీ తరహాలో ఒక బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చర్చ జరిగింది. అప్పటివరకు ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ యూనివర్సిటీలో ఏమేం కోర్సులుండాలి, ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలి..

పరిశ్రమల అవసరాలు తెలుసుకొని, వాటికి అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు ఉండేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులు నిర్వహించాలనేది ముందుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. అధునాతన పరిజ్ఞానం అందించేలా ఈ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ కరీంనగర్ జిల్లా పోలీసులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు





## ప్రధాని మోదీ మూడు రోజుల
# విదేశీ పర్యటన

- 22వ వార్షిక సమ్మిట్‌లో పాల్గొననున్న ప్రధాని
- రష్యా చేరుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జూలై8(నమస్తే ఉదయం): ప్రధాని మోదీ మూడు రోజుల విదేశీ పర్యటనలో ఉన్నారు. అందులో భాగంగా ముందుగా రష్యాలో పర్యటిస్తున్నారు. అక్కడ నిర్వహించే 22వ వార్షిక సమ్మిట్ లో పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌కు ఇతరు అగ్రదేశాలు కూడా ప్రతినిధ్యం వహిస్తున్నాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ తరువాత తొలిసారి ఆస్ట్రియా పర్యటన చేపట్టనున్నారు ప్రధాని మోదీ. ఇంధనం, దేశ భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు ఆకర్షణ, ఆరోగ్యం, విద్య, సంస్కృతి, పర్యాటకంతోపాటు ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. రెండు దేశాల పరస్పర సహాయ సహకారాలపై దృష్టిపెట్టనున్నారు. గత పదేళ్లలో భారత్, రష్యా మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఇండియా మిగతా.. 2లో



## నేటి నుంచి సిఎం రేవంత్
# జిల్లాల పర్యటన

- నేడు సొంత జిల్లాలో పలు కార్యక్రమాలకు హాజరు

హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు మిగతా.. 2లో

## ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో
# మెరుగైన వైద్య సేవలు

- మౌలిక సదుపాయాలపై ఫార్మా కంపెనీలకు బాధ్యతలు
- కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి దామోదర చర్చలు


హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనలకు ఫార్మా కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర మిగతా.. 2లో



## కరీంనగర్ జిల్లా పోలీసులను
# ప్రభుత్వం పట్టించుకోవడంలేదు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బకాయిలను చెల్లించిన ప్రభుత్వం కరీంనగర్ జిల్లా పోలీసులను పట్టించుకోకపోవడం బాధాకరమని మంత్రి అన్నారు. గురుకుల విద్యాలయాలకు రూపొందించిన కొత్త టైం టేబుల్ పనివేళలను కుదించాలని లేఖలో పేర్కొన్నారు. ఉదయం 5 నుండి రాత్రి 9.30 గంటల వరకు పనివేళలు రూపొందించడం వల్ల నిద్రలేమి, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని వెల్లడించారు. రాత్రిపూట స్టడీ అవర్, కేర్ టేకర్ విధులను కూడా టీచర్లకు అప్పగించడం సరికాదన్నారు. వార్డెన్ల పోస్టులు మంజూరైనా భర్తీ



చేయకపోవడం బాధాకరం అన్నారు. తక్షణమే వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా పోలీసులకు నెలల తరబడి టీఏ, డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్ బిల్స్ చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. వివిధ విభాగాల్లోని దాదాపు వెయ్యి మంది పోలీసులు మిగతా.. 2లో

# దివ్యాంగులను కించపరచొద్దు



- వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు
- నిర్మాతలకు సుప్రీం కఠిన ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ,జూలై8(నమస్తే ఉదయం): చలనచిత్రాలు, దృశ్యమాధ్యమాల్లో దివ్యాంగుల చిత్రీకరణపై నిర్మాతలకు సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది. వైకల్యంపై కించపరిచే వ్యాఖ్యలు లేదా వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కోర్టు పేర్కొంది. దివ్యాంగులను సినిమాలు, ఆర్థిక చిత్రాల ద్వారా చిన్నచూపు చూడరాదని, వారి విజయాలను ప్రదర్శించాలని కోర్టు తన



## ముంబైని ముంచెత్తిన
# భారీ వర్షాలు

- ఏకధాటిగా కుంభవృష్టితో పలు ప్రాంతాలు నీట మునక
- 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు
- లోకల్ ట్రైన్ సర్వీసులకు తీవ్ర అంతరాయం
- స్కూళ్లకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

ముంబయి,జూలై8(నమస్తే ఉదయం): దేశ వాణిజ్య రాజధాని ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆరు గంటల పాటు ఏకధాటిగా కుంభవృష్టి కురవగా రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. దీంతో నగరంలో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన మిగతా.. 2లో

## పీర్జాదిగూడ నిర్మాణాల
# కూల్చివేత అక్రమం

- అన్ని అనుమతులు తీసుకున్నాక కూల్చివేస్తారా
- మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దురాగతమే ఇది
- మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 1లో ఉన్న భారీ నిర్మాణాలను సోమవారం ఉదయం అధికారులు కూల్చివేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీ కాంగ్రెస్ నాయకులు అమ్మిన, మీ కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ప్రజల ఇండ్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏమి ఆశించి ఈరోజు కూలగొట్టించాడో ఒకసారి విచారణ చేయించండి. ప్రజా పాలనలో ప్రజలకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా..? మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ



సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తున్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండి. లేదంటే ప్రజలు తిరగబడుతారు. మీ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవు.అని కేటీఆర్ తేల్చిచెప్పారు. అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మింది కాంగ్రెస్ నాయకుడు రాందాస్ గౌడ్, మరో కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్ సింగ్ కుటుంబం. ఈ ప్లాట్లను 2008లో నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. గతంలో రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా ఎన్‌వోసీ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకొని చాలా మంది ప్రజలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు. కానీ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులను వేధించి అమాయక ప్రజలు మిగతా.. 2లో

## టీజీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్
# ఫలితాల్లో 5 తప్పులు

- మెయిన్స్ అర్హుల సంఖ్య పెంపు

హైదరాబాద్,జూలై8(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఆదివారం (జులై 7) విడుదలైన సంగతి తెలిసిందే. అయితే ఈ పరీక్ష ఫలితాలతోపాటు తుది ఆన్సర్ కీ ని కూడా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఆన్సర్ కీలో కొన్ని తప్పులు దొర్లాయని గ్రూప్-1 అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రాథమిక కీలో వచ్చిన ఈ తప్పులను సరిచేయకుండా.. వాటిని టీజీపీఎస్సీ అధికారులు అలాగే ఇచ్చినట్లు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం ఐదు తప్పులు దొర్లాయని, వాటిని టీజీపీఎస్సీ పరిగణనలోకి తీసుకోలేదని దేవేందర్, రాకేశ్ తదితర గ్రూప్ 1 అభ్యర్థులు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు. అయితే ఇప్పటికే కమిషన్ ఫైనల్ కీలో 2 ప్రశ్నల తొలగించింది. మరో ప్రశ్నకు రెండు ఆప్షన్లు మిగతా.. 2లో



## మణిపూర్‌లో మరోమారు
# రాహుల్ పర్యటన

- శరణార్థి శిబిరాల్లో బాధితులకు పరామర్శ

ఇంఫాల్,జూలై8(నమస్తే ఉదయం): మణిపూర్‌లోని జిరిబం, చురచంద్‌పూర్ జిల్లాలలోని పునరావాస శిబిరాలను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం సందర్శించి అక్కడ తలదాచుకున్న నిర్వాసితులతో మాట్లాడారు. గత ఏడాది మే నెలలో ప్రారంభమైన జాతుల మధ్య ఘర్షణలలో ఇప్పటి వరకు 200 మంది మరణించగా నిర్వాసితులైన పౌరులు సహాయ శిబిరాలలో తలదాచుకున్నారు. మణిపూర్‌లోని రెండు లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న తర్వాత ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మిగతా.. 2లో

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

- పలు నగరాలపై పెద్ద ఎత్తున క్షిపణి దాడులు
- చిన్నపిల్లల ఆసుపత్రిపై బాంబుల దాడి
- 20 మంది మృతి, 50 మందికి పైగా గాయాలు

కీవ్,జూలై8(నమస్తే ఉదయం): ఉక్రెయిన్ పై రష్యా భీకర దాడులతో విరుచుకు పడుతోంది. కీవ్ సహా ఆ దేశవ్యాప్తంగా పలు నగరా లపై పెద్ద ఎత్తున క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో 20 మంది వరకు మృతిచెందారు. 50 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడిం చారు. కీవ్‌లో ఉన్న హాస్పిటల్ ఓఖ్‌మాత్‌డిత్.. ఇది దేశంలోని అతిపెద్ద చిన్నారుల ఆసుపత్రి. దీనిపైనా కూడా రష్యా దాడులు చేసింది. నాలుగు నెలల వ్యవధిలో రాజధానిపై జరిగిన దాడులలో ఇదే అతిపెద్దది. పేలుళ్ల ధాటికి స్థానికంగా ఉన్న భవనాలు దద్దరిల్లాయి. కీవ్ నగరంలో ఏడుగురు మృతిచెందారు. క్రీవిరీహ్ లో 10 మంది మృతిచెందగా, దొనెట్స్క్‌లోని పోక్రోవ్స్క్‌లో ముగ్గురు ప్రాణాలు మిగతా.. 2లో



## ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

**మొదటిపేజీ తరువాయి..**

వైద్యారోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశం నిర్వహించారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల పూర్వ వైభవానికి సామాజిక బాధ్యతగా ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధులను విరివిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో ప్రాధాన్యత రంగాలైన పేషెంట్ కేర్, శానిటేషన్, డైట్, బయో ? మెడికల్ వేస్టేజ్, డ్రింకింగ్ వాటర్ సప్లైలతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించటానికి అవసరమైన సిబ్బంది, విద్య, వైద్య రంగాలతో పాటు గర్ల్స్ చైల్డ్ ఎడ్యుకేషన్ లాంటి అంశాలలో ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ ఫండ్స్‌ను అందించాలని కోరారు. మంత్రి విజ్ఞప్తి మేరకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల బలోపేతానికి ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ విధులను విడుదల చేసేందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని 12 ప్రముఖ ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఈ వారంలో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ప్రాధాన్యత కలిగిన అంశాలపై టెక్నికల్‌గా నివేదికను సమర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన, నాణ్యమైన, మెరుగైన సేవలను అందించేందుకు, మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల సూపరిండెంట్లను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

## పీర్జాదిగూడ నిర్మాణాల
# కూల్చివేత అక్రమం

**మొదటిపేజీ తరువాయి..**

లక్షలు పోసి నిర్మించుకున్న ఇండ్లను ఈ రోజు కూలగొట్టించాడు అని కేటీఆర్ మండిపడ్డారు.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియ, సత్యనారాయణ పురం కాలనీ ఎలాట్ల యజమానుల సమస్యను శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవో పరిధిలో చేర్చి ఎలాట్ ఓనర్స్‌కు మేలు చేయడం జరిగింది. కానీ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసమర్ధ ప్రభుత్వం అమాయక ఎలాట్ ఓనర్స్ ఇండ్లను కూల్చివేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై కక్షగట్టి చేస్తున్న వేధింపులకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం. భవిష్యత్తులో మా బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఎలాట్ ఓనర్లను న్యాయం చేయడం జరుగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మా బీఆర్ఎస్ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని, కార్పొరేటర్లను మీరు వేధిస్తున్నారు. మేము ఇలా వేధించాలి అనుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నామరూపాల్లేకుండా పోయేది. కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు మళ్ళీ వడ్డీతో సహా చెల్లిస్తాం. మా నాయకులను, మా మేయర్‌ను, మా కార్పొరేటర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కరీంనగర్ జిల్లా పోలీసులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు

**మొదటిపేజీ తరువాయి..**

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బకాయిలను చెల్లించిన ప్రభుత్వం కరీంనగర్ జిల్లా పోలీసులను పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. తక్షణమే టీఏ, డీఏ, పీఆర్సీ బకాయిలతోపాటు సరెండ్ లీవ్ బిల్స్ చెల్లించాలని లేఖలో తెలిపారు.

## మణిపూర్‌లో మరోమారు రాహుల్ పర్యటన

**మొదటిపేజీ తరువాయి..**

మొట్టమొదటిసారి సంక్షుభిత రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారు. ఘర్షణలు ప్రారంభమైన తర్వాత రాహుల్ గాంధీ మణిపూర్‌ను సందర్శించడం ఇది మూడవసారి. ఈ ఏడాది జనవరిలో రాహుల్ తన భారత్ జోడో న్యాయ యాత్రను మణిపూర్ నుంచే మొదలు పెట్టడం విశేషం. తన తాజా పర్యటనలో రాహుల్ మొదగటా జిరిబం హయ్యర్ సెకండరీ స్కూలులో నెలకొల్పిన సహాయ శిబిరాన్ని సందర్శించారు. తాము ఎదుర్కొన్న దుర్భర పరిస్థితిని, తమ అనుభవాలను జిరిబంలో నిర్వాసితులు రాహుల్ గాంధీకి వివరించినట్లు మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కీషం మేఘచంద్ర విలేకరులకు తెలిపారు. వారికి అవసరాలు ఏమిటో కూడా రాహుల్ నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి కాని, ముఖ్యమంత్రి కాని తమ వద్దకు రాలేదని ఒక బాలిక రాహుల్‌కు చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఆ బాలిక రాహుల్‌ను కోరినట్లు ఆయన చెప్పారు. జిరిబంలో రాహుల్ గాంధీని కలుసుకునేందుకు వేలాది మంది తరలివచ్చారని, రాహుల్‌కు తమ కష్టాలు చెప్పుకుంటూ కన్నీరు
పెట్టుకున్నారని మేఘచంద్ర తెలిపారు. జిరిబం నుంచి అస్సాంలోని సిల్చర్ మీదుగా రోడ్డు మార్గంలో ఇంఫాల్ విమానాశ్రయం చేరుకున్న రాహుల్ చురంద్‌పూర్ ఇజిల్లాలోని తుయిబాంగ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని సందర్శించారు. అక్కడ కూడా ఆయన నిర్వాసితులతో మాట్లాడారు. ప్రజలకు మద్దతు ఇవ్వడంతోపాటు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేయడమే రాహుల్ గాంధీ పర్యటన లక్ష్మని మేఘచంద్ర తెలిపారు. ఇటీవల జరిగిన ఘర్షణలలో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సమస్యలను తెలుసుకోవడం పట్ల కాంగ్రెస్ చూపుతున్న చిత్తశుద్ధికి ఈ పర్యటనే నిదర్శనమని ఆయన అన్నారు. మణిపూర్‌లో గత ఏడాది మే నెలలో మైతీ, కుకీ జాతుల మధ్య ప్రారంభమైన హింసాత్మక ఘర్షణలలో 200 మందికిపైగా ఇరుపక్షాల ప్రజలు మరణించారు.

## టీజీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఫలితాల్లో 5 తప్పులు

మొదటిపేజీ తరువాయి..

కూడా కరెక్టుగా ఉండటంతో పరిగణనలోకి తీసుకున్నామని చెప్పింది. కాగా రాష్ట్రంలో 563 పోస్టుల భర్తీ కోసం జూన్ 9న 31 జిల్లాల్లో టీజీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 1:50 నిష్పత్తి ప్రకారమే అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేశారు. దీని ప్రకారం మొత్తం 28,150 మందికే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి షార్ట్‌ఫాల్ విధానం అమలు చేయడంతో మెయిన్స్‌కు హాజరయ్యేవారి సంఖ్య 31,382 మందికి పెరిగింది. అదనంగా 3,232 మందిని ఎంపిక చేయడంతో 1:57 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్ రాసేందుకు ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ల నెంబర్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ప్రిలిమినరీ పరీక్ష కటాఫ్ మార్కుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని టీజీపీఎస్సీ పేర్కొంది. గ్రూప్ 1 మెయిన్ పరీక్ష తేదీల్లో ఎలాంటి మార్పు ఉండబోదని, గతంలో ప్రకటించిన విధంగానే మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకు పాత 10 జిల్లాల వారీగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. మెయిన్స్ పరీక్షలకు వారం ముందు నుంచి హాల్‌టికెట్లను విడుదల చేస్తామని తెలిపింది.గ్రూప్-1లో ప్రిలిమినరీ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు షార్ట్‌ఫాల్ విధానాన్ని టీజీపీఎస్సీ ఈసారి కొత్తగా అమలు చేసింది. తొలుత చెప్పిన విధంగా 1:50 చొప్పున 563 పోస్టులకు మెరిట్ జాబితాలో 28,150 మంది అభ్యర్థులు మాత్రమే మెయిన్స్‌కు ఎంపిక కావల్సి ఉంటుంది. అయితే మెరిట్ జాబితా ప్రకారం కమ్యూనిటీ రిజర్వేషన్ పోస్టుల్లో 1:50 నిష్పత్తికి తక్కువగా ఉంటే అదనంగా అదే కమ్యూనిటీ నుంచి ఎంపిక చేసే విధానాన్నే షార్ట్‌ఫాల్ అంటారు. ఎస్సీ క్యాటగిరీలో 70 పోస్టులుంటే.. వారందరినీ 1:50 నిష్ప త్తి ప్రకారం లెక్కిస్తారు. తద్వారా 3,500 మంది ఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేసి, మెయిన్స్‌కు రాసేందుకు అర్హత కల్పిస్తారు.

## కాశ్మీర్‌లో ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రదాడి

**ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు**

**శ్రీనగర్,జూలై8(నమస్తే ఉదయం):** జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రఘటనలు చోటుచేసుకుంటు న్నాయి. సోమవారం భారత ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. కథువా జిల్లాలోని మాచేడి ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఇదిలా ఉంటే.. రాజౌరీ వద్ద మారుకోట్ సైనిక శిబిరంపై ఆదివారం తెల్లవారుజామున ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఓ సైనికుడికి గాయాలయ్యాయి. సైనికులు ఎదురుకాల్పులు జరపడంతో చీకట్లో ఉగ్రవాదులు పరారయ్యారు. వీరిని పట్టుకోవడానికి సైన్యం గాలింపు చేపట్టింది. మరోపక్క కుల్గామ్ జిల్లాలో రెండు రోజులుగా రెండు గ్రామాల్లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లలో ఆరుగురు మృతి చెందారు. శనివారం ప్రారంభమైన ఈ ఎన్‌కౌంటర్లలో ఇద్దరు జవాన్లు అమరులయ్యారు.

# దివ్యాంగులను కించపరచొద్దు

**మొదటిపేజీ తరువాయి..**

తీర్పులో పేర్కొంది. ఇన్‌సెన్సిటివ్ లాంగ్వేజ్ హ్యాండ క్యాప్డ్ (పిడబ్ల్యుడి)కి భిన్నంగా దృశ్య మాధ్యమంలో దివ్యాంగులను చిత్రీకరించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేస్తున్నామని సీజేఐ తెలిపారు. సినిమాల్లో.. వారిని కించపరిచే భాష.. దివ్యాంగుల పట్ల సమాజం యొక్క లక్ష్య వైఖరిని వక్రీకరిస్తుందని పేర్కొన్నారు.ఆంఖ్ మిచోలీ చిత్రంలో ప్రత్యేక దివ్యాంగులను అవమాన కరంగా చిత్రీకరించారంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. వికలాంగ హక్కుల కార్యకర్త నిపున్ మల్హోత్రా దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ ఘోష్, న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్, పుల్కిత్ అగర్వాల్ హాజరయ్యారు. విచారణ సందర్భంగా.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరు కాగా.. చిత్ర నిర్మాత సోనీ పిక్చర్స్ ఇండియా తరపున సీనియర్ న్యాయవాది పరాగ్ పి త్రిపాఠి తన వాదనలు వినిపించారు.

ఈ సందర్భంగా దివ్యాంగులను కించపరిచే వ్యాఖ్యలు చేయకుండా చిత్ర నిర్మాతలు మరియు దృశ్య మాధ్యమాలకు సుప్రీంకోర్టు అనేక కఠినమైన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. "వికలాంగ సంస్థాగత వివక్షకు దారితీసే పదాలు ప్రతికూల స్వీయ-ప్రతిబింబానికి దారితీస్తాయి. డైరెక్టర్లు దివ్యాంగులను కించపరిచేలా, వివక్షకు గురిచేసేలా సినిమాల్లో పాత్రలు ఉండొద్దు. వారి బలహీనతల గురించి వైద్యుల సమాచారాన్ని పరిశోధించాలి. దివ్యాంగులపై చిత్రీకరించిన ప్రతి అంశం అపోహలకు దూరంగా ఉండాలి. వైకల్యాలున్న వ్యక్తులు సూపర్ పవర్‌లను మెరుగుపరుచుకున్నారని చెప్తుంటారు.. ఇది అందరి విషయంలో జరగగ పోవచ్చు.

## ముంబైని ముంచెత్తిన భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..**

తర్వాత నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు ముంబయి వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోవండి ప్రాంతంలో 315 మి.మి., పోవాయ్‌లో 314 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. వర్షం కారణంగా సెంట్రల్ రైల్వే సబర్బన్ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. పట్టాలు మునిగిపోవడంతో చాలా లోకల్ రైళ్ల రాక పోకలు నిలిచిపోయాయి. కొన్ని ఆలస్యంగా నడుస్తు న్నాయి. ముంబయి, ఠాణె, పాల్ఘర్, రాయ్‌గడ్‌లో ప్రతి రోజు దాదాపు 30లక్షల మంది సబర్బన్ లోకల్ రైలు సేవలను వినియోగించుకుంటారు. వర్షం కారణంగా ముంబయిలోని అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలు రహదారులపై మోకాలి లోతు నీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల ట్రాఫిక్‌జామ్ కొనసాగుతోంది. అటు స్కూళ్లు, కాలేజీలకు నేడు సెలవు ప్రకటించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. సోమవారం కూడా ముంబయిలో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు అంచనా వేశారు. ముంబయితో పాటు ఠాణె, పాల్ఘర్, కొంకణ్ బెల్ట్‌కు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక నిన్న ఠాణెలోని షాపూర్ ప్రాంతంలో ఓ రిసార్టును వరద నీరు చుట్టుముట్టగా.. అందులో చిక్కుకున్న 49 మందికి పైగా పర్యటకులను ఎన్డీఆర్ ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. పాల్ఘార్ జిల్లాలో పొలంలో పనిచేస్తూ వరదలో చిక్కు కున్న 16 మంది గ్రామస్థులను అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. పలు రైళ్లను అధికారులు రద్దుచేశారు.

పలు రైళ్లను సెంట్రల్ రైల్వే తాత్కాలికంగా రద్దు చేసింది. అదేవిధంగా ఆర్టీసీ బస్సులను కూడా నిలిపి వేశారు. ఇక భారీ వర్షాల కారణంగా ముంబైలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు మున్సిపల్ కార్పొ రేషన్ సెలవు ప్రకటించింది. కాగా, రాష్ట్రంలో భారీ వర్షాల కురుస్తుండటంతో థానే, వాసయ్ (పాల్ఘర్), రాయ్‌గఢ్ (మహద్), చిప్లున్ (రత్నగిరి), కొల్హాపూర్, సాంగ్లి, సతారా ఘట్కోపర్, కుర్లా, సింధుదుర్గ్ ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఎన్డీఆర్ఎఫ్ ప్రకటించింది.



## వైఎస్ చేసిన అభివృద్ధే..
# నేడు తెలంగాణకు బాటలు

**రాహుల్‌ని ప్రధానిని చేయడమే వైఎస్సార్ ఆకాంక్ష**

**రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై8 (నమస్తే ఉదయం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ భట్టి విక్రమార్క పాల్గొని.. వైఎస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి.. నివాళులు అర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నాడు వైఎస్ రాజశేఖర్ చేసిన అభివృద్ధే.. నేడు తెలంగాణకు బాటలు వేసిందన్నారు. నాడు చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకూ వైఎస్సార్ చేసిన పాదయాత్ర.. 2004లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే.. ఈనాడు అదే స్ఫూర్తితో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని పేర్కొన్నారు. దాని ఫలితంగా తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే కాకుండా.. కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన ప్రతిపక్ష హోదాను సాధించామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే వైఎస్సార్ ఆకాంక్ష అని పేర్కొన్న సీఎం రేవంత్.. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రధాని పదవికి ఒకే ఒక్క అడుగు దూరంలోనే ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తే.. పేదలకు సంక్షేమం అందడంతో పాటు.. దేశం అభివృద్ధి చెందుతుందని, నిరుపేద యువతీ, యువ కులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చేసే బాధ్యత తీసుకుని ఎవరైతే పనిచేస్తారో.. వాళ్లే వైఎస్సార్ అసలు రాజకీయ వారసులని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం దేశానికి చాలా అవసరమన్నారు. వైఎస్సార్ ఇచ్చిన సందేశాన్ని తీసుకుని.. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయా లని అందరూ ప్రతినబూనాలని కోరారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేసినవారిని రాహుల్ గాంధీ వ్యతిరేకులుగా పరిగణిస్తామన్నారు. కాంగ్రెస్ ను వీడిన నేతలంతా తిరిగి పార్టీలోకి రావాలని కోరారు. పార్టీని వీడిన వారందరినీ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తు న్నామని, అందరం కలిసి రాహుల్ ను ప్రధానిని చేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. దేశంలో సంక్షేమం అంటే గుర్తొచ్చేది వైఎస్సార్ పేరేనన్నారు. మూసి అభివృద్ధి, మెట్రోరైలు, హైదరాబాద్ లో శాంతి భద్రతల విషయంలో వైఎస్సార్ తమకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడి పదవిని చేపట్టి నిన్నటికి మూడేళ్లైందని తెలిపారు. వైఎస్సార్ జయంతి సందర్భంగానే 35 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవుల్ని ఇచ్చామని వెల్లడించారు. అంతకుముందు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గొప్ప పనులు చేసి అతి తక్కువ సమయంలో కోట్లాది మంది ప్రజల మనసులో వైఎస్సార్ సుస్థిర స్థానాన్ని సంపా దించుకున్నారన్నారు. వైఎస్సార్.. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా చూశారని, ఆయన ఆలోచనలకు అనుగుణంగానే పనిచేస్తామని పేర్కొన్నారు. జలయజ్ఞం ద్వారా వ్యవసాయానికి నీరందించి రైతులకు, ఫీజు రీ ఎంబర్స్ మెంట్ చేసి పేద పిల్లలకు వైఎస్సార్ దేవుడయ్యారని కొనియాడారు. ఆరోగ్యశ్రీతో పేదల వైద్యానికి మేమున్నామన్న భరోసా ఇచ్చారని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధిలో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని కితాబిచ్చారు. ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం ఇచ్చిన హామీని అమలు చేస్తామని తెలిపారు.

## ట్రామా సెంటర్ ఏర్పాటు ఎందరికో ప్రాణదానం

**సెంటర్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి**

**నల్లగొండ,జూలై8 (నమస్తే ఉదయం):** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడం ఎంతో గొప్ప విషయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం అయన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద ఏడీపీ సంస్థ ద్వారా సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ట్రామా కేర్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించేందుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి.

## ధన్వంతరి ఇంటర్నేషనల్ మోసం

**ఫౌండేషన్ పేరుతో భారీ మోసం**

**అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశలు**

**భారీగా పెట్టుబడులు రాబట్టుకున్న సంస్థ**

**రూ. 540 కోట్ల వరకు డిపాజిట్లు సేకరణ**

**హైదరాబాద్,జూలై8 (నమస్తే ఉదయం):** హైదరాబాద్‌లో ధన్వంతరిఇంటర్నేషనల్ ఫౌండేషన్ పేరుతో భారీ మోసం జరిగింది. పౌండేషన్‌లో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశ చూపి భారీ మొత్తంలో డబ్బులు కాజేశారు. తాజాగా ఇదంతా మోసం అని తేలడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ధన్వంతరి ఫౌండేషన్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాలని నిర్వాహకులు కమాలకర్ శర్మ బాధితులపై ఒత్తిడి తెచ్చాడు. పెట్టుబడులకు అధిక వడ్డీ ఇస్తామని మభ్యపెట్టాడు. ఈ క్రమంలోనే వారు పెట్టిన పెట్టుబడులకు ప్లాట్స్ ఇస్తామని ఆశ చూపించారు. దీంతో నాలుగు వేల మంది దగ్గర సూమారు రూ. 540 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించారు. బాధితులు అందరూ ఒకే కమ్యూనిటీకి చెందిన వారు కావడం గమనార్హం. అయితే ఇదంతా మోసం అని గమనించిన బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో బాధితులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీసీఎస్ డీసీపీ శ్వేతా రెడ్డి మాట్లాడుతూ కమలాకర్ శర్మను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ధన్వంతరి ఫౌండేషన్ పేరు మీద ఉన్న ఆస్తులను సీసీఎస్‌కు అటాచ్ చేసినట్లు తెలిపారు. అలాగే సీజ్ చేసిన ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు వచ్చేలా చూస్తామన్నారు.

## యుద్ధప్రాతిపదికన స్కిల్ యూనివర్సిటీ

**మొదటిపేజీ తరువాయి..**

సీఎం భట్టి విక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించాలని చెప్పారు.

నిర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని, కేవలం 15 రోజుల వ్యవధి ఉన్నందున ప్రతీ అయిదు రోజులకోసారి సమావేశం కావాలని సీఎం వారికి దిశా నిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా.. ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టాలా... మరేదైనా విధానం అనుసరించాలా.. అనేది కూడా పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులైన ఒక కన్‌స్టలెంట్ ను నియమించు కోవాలని సీఎం చెప్పారు. యూనివర్సిటీ వ్యవహారాలకు పరిశ్రమల శాఖ నోడల్ డిపార్టుమెంట్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్ మెంట్స్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ హరి ప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, ఐ ల్యాబ్స్ శ్రీనిరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ ను ముఖ్యమంత్రి పరిశీలించారు. దాదాపు ఇరవై నిమిషాల పాటు కలియ తిరిగి అందులో ఉండే సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే కాలేజీ సిబ్బందితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## నేటి నుంచి సిఎం రేవంత్ జిల్లాల పర్యటన

**మొదటిపేజీ తరువాయి..**

శంకుస్థాపన చేయనున్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా ప్రముఖులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరనున్నారు. మ. 12.45 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటారు. మ. 12.45 నుంచి ఒంటి గంట వరకు కలెక్టరేట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఉమ్మడి జిల్లా ప్రముఖులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధిపై సమీక్షా నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 5.45 వరకు భూత్పూర్ రోడ్డులోని ఏఎస్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

## ప్రధాని మోదీ మూడు రోజుల విదేశీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి..**

ఎంతో అభివృద్ధి చెందిందన్నారు పీఎం మోదీ.రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను తన స్నేహితుడిగా అభివర్ణించారు ప్రధాని మోదీ. ఆయనతో భేటీ నేపథ్యంలో ప్రపంచంలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. అలాగే రష్యా - భారత్‌లో మరింత



అభివృద్ధి జరిగేలా, శక్తివంతమైన భారతీయ సమాజాన్ని నిర్మించేందుకు అవకాశం కల్పించేలా కూడా చర్చలు జరిపినట్లు సమాచారం. ఇక ఆస్ట్రియాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డెర్ బెల్లెన్, ఛాన్సలర్ కార్ల్ నెహమ్మర్‌లను కలిసే అవకాశం ఉంది. ఆస్ట్రియా, భారత్ కు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామి అని తనకు పూర్తి నమ్మకం ఉందని పీఎం మోదీ ధీమా వ్యక్తం చేశారు.

అనేక దేశాల భాగస్వామ్యాలను గుర్తించి తమతో ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి అని చెప్పుకొచ్చారు ప్రధాని మోదీ. ఈ సందర్భంగా అనేక కొత్త ఆవిష్కరణలు, సాంకేతికత రంగాలలో అభివృద్ధి చెందేందుకు కలసి లాభదాయకమైన పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి భేటీ కానున్నట్లు తెలుస్తోంది. భారతీయుల వృత్తినైపుణ్యానికి తగిన ప్రధాన్యత ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు ప్రధాని మోదీ.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

**మొదటిపేజీ తరువాయి..**

కోల్పోయారు. అత్యాధునిక కింజాల్ రాకెట్లను రష్యా ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన ఆరోపిస్తోంది. 40కి పైగా క్షిపణులతో తమ దేశంలోని ఐదు నగరాలను మాస్కో లక్ష్యంగా చేసుకున్నదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించాడు. పిల్లల ఆసుపత్రి భవనం పాక్షికంగా ధ్వంసమైందని, శిథాలల కింద చిక్కుకుపోయినవారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ వ్యవహారంపై ప్రపంచ దేశాలు మౌనంగా ఉండకూడదన్నారు. రష్యా ఏం చేస్తుందో అందరూ గమనించాలంటూ సోషల్ మీడియా ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే, అమెరికాలో నాటో శిఖరాగ్ర సమావేశాల సమయంలో ఈ దాడులు చేసుకోవడం గమనార్హం.

# ప్రజావాణి సమస్యలను తత్వమే పరిష్కరిస్తాం: కలెక్టర్ బిఎస్ సంతోష్

## ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 8(నమస్తే ఉదయం):**
ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల



ప్రజావాణిలో ప్రజల నుండి సమస్యలు వింటున్న కలెక్టర్ బి.ఎస్ సంతోష్

పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి 45 ఫిర్యాదులను అదనపు కలెక్టర్లు ముసిని వెంకటేశ్వర్లు, నర్సింగరావులతో కలిసి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో ఆదివారం రాత్రి వరకు కొనసాగిన జగన్నాథ రథయాత్ర

**రాజేంద్రనగర్, జూలై8(నమస్తే ఉదయం):**
అత్తాపూర్‌లో ఆదివారం రాత్రి భగవాన్ జగన్నాథ రథయాత్ర కనుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తులు ఈ రథయాత్రలో పాల్గొన్నారు. కోలాటం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులతో పోలీసులు

ఆటలు, భజనపాటలతో అత్తాపూర్ పరిసరాలు మారుమోగాయి. పూజలలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ర్యాలీలో మజ్లీస్ నాయకులు ప్రవీణ్ నావేందర్ పాల్గొన్నారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌లు దగ్గర ఉండి బందోబస్తును పర్యవేక్షించారు.

# ప్రజా నాయకుడు డాక్టర్ వైఎస్ఆర్

## పిసిసి మహిళ ఉపాధ్యక్షురాలు ఏ.సదాలక్ష్మి

**రాజేంద్రనగర్, జూలై 8(నమస్తే ఉదయం):**
ప్రజా నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని పిసిసి మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి కొనియాడారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీ య డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఉడంగడ్డ బస్తిలో ఆయన చిత్రపటానికి ఆమె పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సదా లక్ష్మీ మాట్లాడుతూ... హరిత ప్రదాత, జలయజ్ఞ నేత ఆయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రగతి పథంలో ముందుకు



ఉడంగడ్డలో డాక్టర్ వైయస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సదాలక్ష్మి

సాగిందన్నారు. నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలను అష్టలక్ష్యంగా తీర్చిదిద్దిన ఘనత రాజశేఖర్ రెడ్డి దేనన్నారు. ధనలక్ష్మి, ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి, సౌభాగ్య లక్ష్మి, రాజ్యలక్ష్మి, విద్యాలక్ష్మిలాంటి పాలన రేవంత్ రెడ్డి పాలనలో చూస్తామనన్నారు. రాజ శేఖర్ రెడ్డి కళలు కన్నా రాహుల్ గాంధీ ప్రధానమంత్రిని చేయడమే కలగా రాజశేఖర్ రెడ్డి దేయంగా పనిచేయాలని ఆనాడు ముందుకు వచ్చి పనిచేశారన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ వారి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు అన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, మహిళా నాయకురాలు అనసూయ లలిత సరిత జ్యోతి అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హిమాయత్ సాగర్ సెక్షన్‌లో

# విద్యుత్ సరఫరా నిలిపివేత

**బండ్లగూడ, జూలై8(నమస్తే ఉదయం):**
హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమత్ల నిమిత్తం కాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు భవాని కాలనీ, లిబ్దం విల్లాస్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



# పేదల నాయకుడు డాక్టర్ వైఎస్ఆర్

## - కె ఎస్ దయానంద్



మాజీ సీఎం స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కేఎస్ దయానంద్

**సరికొత్త చరిత్రను సృష్టించిన మహానీయుడు వైఎస్ఆర్..**
**ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు..**

**రాజేంద్రనగర్,జులై 08(నమస్తే ఉదయం):**
పేదవాడి గుండె చప్పుడు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ అని,సంక్షేమంతో చరిత్రలో చెరగని ముద్ర వేశారని రంగారెడ్డి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్(డేవిడ్)అన్నారు.దివంగత నేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా సోమవారం బుద్వేల్ ఫిల్టర్ బెడ్ చౌరస్తాలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కోరని దయానంద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ...రాజకీయాల్లో దివంగత మహానీయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి సరికొత్త చరిత్రను సృష్టించి రాజనీతిజ్ఞుడుగా నిలిచారని కోరని దయానంద్ అన్నారు.
తెలుగువారికి పరిచయం అక్కర్లేని పేరు,ఉమ్మడి ఎపి సిఎంగా రెండుసార్లు బాధ్యతలు స్వీకరించి,తన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి వైఎస్ఆర్ అని కొనియాడారు. వైఎస్ఆర్ ప్రభుత్వ హయంలో ఆయన రూపొందించిన పథకాలు దేశానికే దిక్సూచీల మారాయని తెలిపారు.ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్ పథకం,రైతులకు ఏక కాలంలో లక్ష రూపాయల పంట రుణమాఫీ,104,108 అత్యవసర వైద్య సేవలు,ఆరోగ్య శ్రీ,విద్యార్థులకు ఫీజ్ రీ-ఇంబార్సుమెంట్ పథకం ద్వారా పేదలకు ఉన్నత విద్యను అందించి దేశంలో ఆత్మ గౌర వాన్ని పెంచి,దేశం మొత్తం గర్వించదగ్గ నాయకుడిగా మన్ననలు పొందాడని ఆయన గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీలో రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయ నాయకుడని ఆయన కొనియాడారు.ఈ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 8(నమస్తే ఉదయం):**
జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు గట్టు మారేన్న రాజు కోరారు. సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కస్తూర్బా గురుకుల వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతీ గృహాలు తెరచి మూడు వారాలు గడుస్తున్నా జిల్లాలో ఇప్పటివరకు కొత్త మెనూ ఏర్పాటు చేయలేదని పాత మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని విమర్శించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి వసతి గృహాల్లో కొత్త మెనూ ఏర్పాటు చేయడానికి సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులను ఆదేశించాలని కోరారు. జిల్లాలో 29 ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు ఉన్నాయని వాటిలో విద్యార్థులు దాదాపు 4,000 మంది ఉన్నారని,వసతి గృహాలలో ఖాళీగా ఉన్న వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని 9 వసతి గృహాలకు వార్డెన్లు లేక ఇన్చార్జిలతో కొనసాగిస్తున్నారని అన్నారు బిసి వసతి గృహాలకు ఫిల్టర్ నీళ్ల కోసం మిషన్ వచ్చిన ఉపయోగించడం లేదని,రాత్రి వేళల్లో కరెంటు పోతే విద్యార్థులు అంధకారంలో ఉండకుండా ప్రభుత్వం నుండి ఇన్వెటర్ వచ్చిందని వాటిని ఉపయోగించడం లేదని, సోలార్ లైట్లు వచ్చిన వసతి గృహంలో బిగించలేదని అన్నారు. సొంత భవనాలు లేని వసతి గృహాలకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలని, వసతి గృహాలలో మెస్ కమిటీ, స్పోర్ట్స్ కమిటీ లాంటి కమిటీలు ఏడు వేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణ జిల్లా అధికారులు చేయడం లేదని దీనివల్ల కొంతమంది వార్డెన్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అన్నారు. గత నెల 18 నుండి వసతి గృహాలలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు సర్వేలో గుర్తించిన సమస్యలపై దశలవారీగా ఆందోళన పోరాటాలు



సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు

నిర్వహిస్తామని హెచ్చరించారు విద్యార్థులకు ప్రభుత్వం నుండి రావాల్సిన నోటుబుక్కులు, బట్టలు,దుప్పట్లు, పెట్టెలు, గ్లాసులు, ప్లేట్లు, చెప్పులు.
బ్యాగులు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు,పెన్సిళ్లు ఇంకా ఇవ్వలేదని అన్నారు. వసతి గృహాలలో స్నానపు గదులు మరుగు దొడ్లు లేక విద్యార్థులు మలమూత్ర విసర్జనకు ఆరు బయటకు పోతున్నారని వసతి గృహాలలో సుదీర్ఘకాలం పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని కోరారు లేనియెడల విద్యార్థులతో కలిసి ఆందోళన పోరాటాలు చేస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్య క్షులు ఆర్.విజయకుమార్, ఎల్కూర్ సవరణ, కర్రెప్ప, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 8(నమస్తే ఉదయం):**
తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం యొక్క ఇంటింటా ఇన్నోవేటర్ 2024 కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆవిష్కరించారు.
తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ఫ్లాగ్షిప్ ప్రోగ్రామ్ అయిన 'ఇంటింటా ఇన్నోవేటర్ 2024' 6వ ఎడిషన్ ను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆవిష్కరించారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు ధరకాస్తు చేసుకునే సమయం వచ్చేసిందని, ముఖ్యంగా గ్రామీణ ఆవిష్కర్తలు సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్న ఈ కార్యక్రమం తెలంగాణ అంతటా ఆవిష్కరణల కోసం పెంపొందించే వాతావరణాన్ని సృష్టించేందుకు అంకితభావంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ మేరకు ఇంటింటా ఇన్నోవేటర్ 2024 పోస్టర్‌ను కలెక్టర్ లాంచ్ చేశారు.
తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ప్రస్తుతం 2024 ఎడిషన్ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. అన్ని వర్గాలలో ఉన్న ఆవిష్కర్తలు, ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో నివసిస్తున్న వారిని, వారి అద్భుతమైన ఆలోచనలు మరియు ప్రాజెక్టులను సమర్పించమని ప్రోత్సహిస్తున్నాము. ఈ సంవత్సర కార్యక్రమం ఇప్పటి వరకు అత్యంత విస్తృతమైనదిగా ఉండబోతోంది, విస్తృతమైన ప్రేక్షకులను చేరుకుంటుంది మరియు మొగ్గతున్న నూతనోన్ముఖులకు బలమైన మద్దతు వ్యవస్థను అందిస్తుంది. ఈ ఏడాది వచ్చిన ఆవిష్కరణలు అన్నింటిలో, గొప్ప ఆవిష్కరణలు అన్నింటికీ ఆగస్టు 15న అవార్డు ప్రధానోత్సవం ఉంటుంది.
ఇంటింటా ఇన్నోవేటర్ 2024 ఇంతకు ముందు ఎన్నడూ లేని



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ బి ఎస్ సంతోష్

విధంగా విస్తృత ప్రేక్షకులను చేరుకునే దశగా మిగిలిపోతుందని హామీ ఇస్తుంది. గ్రామీణ ఆవిష్కర్తలను సాధికార పరచడంపై దృష్టి సారించి, ఈ కార్యక్రమం 33 జిల్లాలన్నింటినీ కవర్ చేయాలని, 3000లకు పైగా ఎక్కువ గ్రామ పంచాయతీలతో నిమగ్నమవ్వాలని మరియు 1 కోటికి పైగా గ్రామీణ ప్రజలతో అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
ఈ ఏడాది కార్యక్రమంలో సరికొత్తగా జిల్లాకు ఒకరి చొప్పున 33 మంది యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తోంది - ఇన్నోవేషన్ మిత్రాలుగా. మూడు నెలల కాలానికి (జులై-సెప్టెంబర్ 2024) ఆన్-గ్రౌండ్ సమన్వయకర్తలుగా పనిచేసే ఈ మిత్రాలు, జిల్లా అధికారులు, ఎన్జీఓలు, పౌర సమాజ సంస్థలు, గ్రామీణ ప్రజలతో సహా విభిన్న వాటాదారులతో నిమగ్నమవడంలో కీలక పాత్ర పోషిస్తారు. తెలంగాణ మారుమూల గ్రామాల్లో కూడా ఆవిష్కరణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సరికొత్త ఆవిష్కరణలను తీసుకురావటమే వారి లక్ష్యం. ఇంటింటా ఇన్నోవేటర్ 2024 కార్యక్రమం దరఖాస్తు ప్రక్రియ సులువుగా, అనుకూలంగా ఉండేలా రూపొందించబడింది. ఆవిష్కర్తలు వారి దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 ఈ నంబరుకు పంపించవచ్చు. దయచేసి దరఖాస్తులో ఈ క్రింది సమాచారం ఉండేలా చూసుకోండి: పేరు, వయసు, ఫోటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, 100 పదాలలో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణ యొక్క నాలుగు చిత్రాలు (హై రిజల్యూషన్), ఆవిష్కరణ యొక్క విధులను ప్రదర్శించే రెండు వీడియోలు. మీ వివరాలు పంపించేందుకు ఆఖరి తేదీ ఆగస్టు 3, 2024. ఇతర వివరాలను తెలుసుకునేందుకు వాణి బుద్ధవారపు, మేనేజర్ తెలంగాణ రాష్ట్ర ఇన్నోవాషన్ సెల్‌కు కింద చూపన సెల్ నెంబర్‌కు సంప్రదించాలి అన్నారు.

pr-tsic@telangana.gov.in
9441191829

# స్నేహిత హిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## - మేయర్ ఎం.లతా ప్రేమ్ గౌడ్

**బండ్లగూడ, జూలై8(నమస్తే ఉదయం):**
బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్నేహిత హిల్స్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ ఎం లతా ప్రేమ్ గౌడ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 14వ వార్డులో 30 లక్షల రూపాయలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి , స్థానిక కార్పొరేటర్ ఆసియా కాజాతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ... బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సమగ్రంగా అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చి దిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు వెంకట రెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజు వర్ధన్, శేఖర్, మాధవి, హరిత, విజయ లక్ష్మి, లత, మాధురి, మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్నేహిత హిల్స్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డిలు



# పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### మొక్కలు నాటడం సామాజిక బాధ్యత: కార్పొరేటర్ సంగీత

### అత్తాపూర్ వద్ద మూసి ఒడ్డున కార్పొరేటర్ సంగీతతో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జులై 08(నమస్తే ఉదయం):** మొక్కలతోనే మానవ మనుగడని,ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా సోమవారం నియోజకవర్గంలోని రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ, మణికొండ మున్సిపాలిటీలో నాయకులు, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని ఆయన అన్నారు.పచ్చదనం గొప్పతనం ప్రతిఒక్కరికి తెలియాలన్నారు. మానవ తప్పిదాల కారణంగా కాలుష్యం పెరిగి భూమికి పెను ప్రమాదం జరిగే అవకాశ ముందని, పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని సుస్థిరంగా కాపాడుకోవడం కూడా మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకుని భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు.ప్రతి ఇంటిలో తప్పనిసరిగా 6 మొక్కలు పెట్టుకోవాలని, ప్రతి ఒక్కరు తన గురించి,తన ఆరోగ్యం గురించి చెట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటితేనే మానవ మనుగడ సుసాధ్యమవుతుందన్నారు.మానవ మనుగడ సాఫీగా సాగాలంటే పర్యావరణం సమతుల్యంగా ఉండాలన్నారు.మన రోజువారి జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.మానవాళి అవసరాల కోసం చేపడుతున్న చర్యలు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు.మనం పర్యావణాన్ని రక్షించుకుంటే పర్యావరణం మనల్ని రక్షిస్తుందన్నారు.మనం పీల్చే గాలి స్వేచ్ఛగా ఉండాలన్నా ..ప్రతిరోజు మొక్కలకు నీళ్లు పోసే విధంగా పిల్లలకు అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు.ప్రతి ఒక్కరు నియోజకవర్గాన్ని పచ్చదనంతో నింపి కాలుష్య రహితంగా తీర్చిదిద్దుకోవడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్,డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్ రెడ్డి, చెరుకు అమరేందర్, గుర్రంపల్లి యాదగిరి, వనం నరసింహ మాదిగ,చిన్న,బంగి శీను, మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ వద్ద మూసి ఒడ్డున కార్పొరేటర్ సంగీతతో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# ప్రతిఘటన పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం సీఐటీయూ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 8(నమస్తే ఉదయం):** కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతిఘటన పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ అన్నారు. జూలై 10న జరిగే దేశవ్యాప్త ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ భవన నిర్మాణ కార్మికులు, ఆశా వర్కర్లు కరపత్రాన్ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం వివిధ రకాల సేవలు అందిస్తున్నారని మళ్లీ ప్రభుత్వం కొత్తగా ఆశ వర్కర్లకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. అదనపు పని భారాలు మోపడమే కాకుండా కనీస వేతనాలు ఇవ్వకుండా వారిని శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని అన్నారు. పరీక్షలతో సంబంధం లేకుండా తక్షణమే ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను నిర్మాణరంగ కార్మికులకు ఖర్చు చేయకుండా ప్రభుత్వం నిధులను దారి మళ్లిస్తున్నదని ప్రభుత్వ బాధ్యతరాహిత్యానికి ఇది నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వము చట్టాన్ని సమగ్రంగా మార్చివేసి నిర్మాణంగా కార్మికులకు సంక్షేమ పథకాలను దూరం చేసే విధంగా చట్టంలో మార్పులు తీసుకొచ్చిందని విమర్శించారు విమర్శించారు. జిల్లాలో కూడా గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలకు సవరణ చేస్తూ వారిని బానిసలుగా చేస్తూ దోపిడీ చేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వ దమన నితి కి వ్యతిరేకంగా కార్మిక వర్గం ప్రతిఘటన పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని జులై 10న జరిగే ధర్నా కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మమ్మ, శశి కళ లక్ష్మీశారద, హుస్సేనమ్మ, భవన నిర్మాణ కార్మికులు తిమ్మప్ప, లోకేష్, వెంకటేష్, మద్దిలేటి, రామకృష్ణ, గోవిందు పాల్గొన్నారు.






కరపత్రాలను విడుదల చేస్తున్న జె.రుద్రకుమార్, తదితరులు

# జులై 10న చేపట్టనున్న కార్మికుల కోరికల దినోత్సవంను విజయవంతం చేయాలి

### కరపత్రాల విడుదల పంపిణీ చేసిన సీఐటీయూ నాయకులు

**రాజేంద్రనగర్, జులై8 (నమస్తే ఉదయం):** ఈనెల 10వ తేదీన కార్మికుల కోరికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సిఐటియు కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జె.రుద్రకుమార్ తెలిపారు. అందుకు సంబంధించిన కలపత్రాలను సోమవారం విడుదల చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జాజాల రుద్రకుమార్, కోశాధికారి భాస్కర్. ప్రవీన్‌లు హాజరై మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 2024 జులై 10న కార్మికుల కోరికల దినోత్సవం చేయాలని నిర్ణయించారన్నారు. అందులో భాగంగా 10వ తేదీన కాటేదాన్ పారిశ్రామిక కేంద్రాలలో జరిగే ర్యాలీ, ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులందరూ కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్లగా సాగించిన సంస్కరణలు ప్రైవేటీకరణ విధానాలను ఇంకా వేగవంతం చేసి దేశ సంపదను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు అప్పచెప్తా ఉందని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేయకముందే మతోన్మాదా కార్పొరేట్ శక్తుల లాభాలు సాధించి పెట్టింది బీజేపీ ప్రభుత్వం అన్నారు. కార్మికుల ఈపీఎఫ్ బకాయి చెల్లింపులో యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించిందన్నారు. ఇలా అనేక రంగాల కార్మికుల అందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, కర్మెంటు పరిశ్రమలలో కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు.

2023 డిసెంబర్ 7న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగ కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని, వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు.

ట్రాన్స్పోర్ట్, ఆటో కార్మికులు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమ స్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కావలి, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, .స్కీం వర్కర్స్. కాంటాక్ట్ .ఔట్సోర్సింగ్ అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కాలయాపన చేయవద్దని వారు డిమాండ్ చేశారు. కార్మికులందరూ భారీ ఎత్తున కదిలి వచ్చి కార్మికుల సమస్యల మీద జరుగుతున్న డిమాండ్స్ డే ను విజయవంతం చేయాలని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో నాయకులు జాంగిర్. మల్లేష్. లక్ష్మణ్. దత్తు .శశికాంత్ .సచిన్ .తదితరులు పాల్గొన్నారు.



భూత్పూర్ రాజీవ్ స్వగృహ కాలనీలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# పర్యావరణ పరిరక్షణ కోసం నడుము కట్టాలి: ఎమ్మెల్యే జిఎంఆర్

### పేద ప్రజల పెన్నిధి డాక్టర్ వైయస్సార్: ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్ నగర్,జూలై8(నమస్తే ఉదయం):** పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుము కట్టాలని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అన్నారు.

సోమవారం వన మహోత్సవ కార్య క్రమంలో భాగంగా భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని రాజీవ్ స్వగృహలో మొక్కలు నాటి, అనంతరం తాటిపత్రి గ్రామం టేకులగుట్ట వద్ద వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని, విద్యార్థులు, అధికారులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నాటారు.

**పేదల పెన్నిధి డాక్టర్ వైయస్సార్:**

ఎమ్మెల్యే జిఎంఆర్ పేదల పెన్నిధి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని దేవరకద్ర నియోజకవర్గం శాసన సభ్యులు జిఎంఆర్ కొనియాడారు. సోమవారం భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్" వైయస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలవేసి ఎమ్మెల్యే జియంఆర్ నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వర్గీయ మాజీ సీఎం వైయస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్



లబ్ధిదారులకు షాది ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, జూలై 8(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తుందని దేవరకద్ర నియోజక వర్గం శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. సోమవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధు సూదన్ రెడ్డి అందజేశారు.

అనంతరం వన మహోత్స వంలో భాగంగా కృష్ణ టెంపుల్ సమీపంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జియంఆర్ మొక్కలు నాటారు.

అనంతరం మున్సిపాలిటీ కేంద్రంలోని 6వార్డులో అబూబా కర్, నసీర్ ఏర్పాటుచేసిన అధునాతన ఎన్ఎస్ ఆర్ ఫర్నిచర్స్ షాప్‌ను ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఫర్నిచర్ షాప్‌ను నెలకొల్పిన యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తయారీ అక్షయపాత్రకు ఇవ్వవద్దు

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మహిళల విజ్ఞప్తి

**రాజేంద్రనగర్, జులై 8(నమస్తే ఉదయం):** ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్నం భోజన తయారీని తామే నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారని మహిళలు కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం నాంపల్లి బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని కేంద్ర మంత్రి బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డికి రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఎమ్మెల్యే, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి శంషాబాద్‌కు చెందిన అక్షయ పాత్ర కార్మికులు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం ద్వారా 22 సంవత్సరాల నుంచి మిడ్ డే మీల్స్ కార్మికుల నే కొనసాగించాలని కోరుతూ కార్మికులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

4మండలాలు (శేరిలింగం పల్లి, మొయినాబాద్, గండిపేట, రాజేంద్ర నగర్ ) లను అక్షయ పాత్ర ఫౌండేషన్ కు ఇవ్వడం జరిగింది. ఈ మండలాలతో పాటూ 02-07-2024) శంషాబాద్ మండలాన్ని కూడా అక్షయ పాత్రకు ఇవ్వవద్దని వినతి పత్రం అందజేశారు.

ఈ విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ని కోరారు.



కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన తయారీ కార్మికులు

పాఠశాలల్లో వంటలు వారే చేసుకొనేటట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తోకల శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733